# వెలుగు

కాలువశ్రీ



తల పైకెత్తి ఆకాశం దిక్కు చూశాడు పోచయ్య ... అక్కడక్కడ మబ్బు తెరలు కమ్ముకొనున్నాయి. చల్లగా గాలి వీస్తుంది ... గాలికి మేఘాలు విడిపోతున్నాయి. మరి కొంత సేపట్లో ఆకాశం నిర్మలంగా తయారయింద ... 'ఇగ పరువలేదు. వానేం రాదు. మందెయ్యాలె' అనుకున్నాడు. గంపలో వున్న యూరియాను చిన్న గమాల్లోకి తోడాడు. గమాల చేతిలో పట్టుకొని పొలంలోకి దిగాడు ... రోగం తగిలి పొలమంతా ఎర్రగా వుంది ... 'ఈ మందేత్తె పొలం పచ్చగైతది ... దేవుడు మన్నిత్తె పుట్టెడన్ని వడ్లు మా రాత్తయి ...' తనలో తాననుకుంటూ పొలంలో తిరుగుతూ మందు చల్లుతున్నాడు ... గమాల్లోని మందయి పోగానే గంపలోని మందు మరింత తెచ్చి చల్లుతున్నాడు ... పొలం మోకాలు కింది వరకు దిగబడుతుంది ... బలవంతంగా కాలు పైకి లేపుతూ ఆయాసంగా అడుగులేస్తూ తన పని కానిస్తున్నాడు. సగం వరకు చల్లడం పూర్తయింది ... ఒడ్డుపై కూర్చున్నాడు పోచయ్య ... సాయంత్రం దాదాపు ఐదుగంటల టైమవుతుంది ... 'పొద్దు పోతంది ... జెప్పున మందేసి పోవాలె' అనుకుంటూ లేచి నిల్చున్నాడు. ఆకాశం దిక్కు చూశాడు. అంత వరకూ నిర్మలంగా వున్న ఆకాశంలో ఇపుడు మేఘాలు అటూ ఇటూ పరుగిడుతున్నాయి. కొంచెం జంకాడు పోచయ్య. 'వానత్తె మందంత నట్టమయితది ... ఏం జెయ్యాలె' అనుకుంటూ పైకే చూస్తున్నాడు. మళ్ళీ మేఘాలు విడిపోతున్నాయి. 'ఇగ వానేం రాదు ... అనుకొని గమాల్లోకి మందు తీసుకొని పొలంలోకి దిగాడు ... పొలమంతా తిరుగుతూ మందు చల్లడం పూర్తిచేశాడు ... ఒడ్డుకొచ్చి నిల్చున్నాడు ... తృప్తిగా పొలం దిక్కు చూశాడు .. ఆకాశం దిక్కు మళ్ళీ చూశాడు. ఆకాశం నిండా

వృష్టిని మించిన నీరు .. కడుపులో ఉరుమును మించిన కల్లోలం...

కొడుకును కోల్పోయి, ఐదేళ్ళెలా గడిపాడో తెలియదతనికి. "పాపిష్టి బతుకు బతుకవట్టి. నన్ను గొంచపొయ్యి బతికే పొల్లగాన్నుంచకపాయె బగవంతుడు. ఆ దేవునిగ్గూడ గురి మరియాదలేదు. కాల్లెకు పోయెటోన్నేమొ ఉంచుతడు. నాల్గుదినాలు బతికెటోన్నేమొ కొంచపోతడు. ఏం దేవుడో ఏందో? పాపపు ముండకొడుకుల నుంచవట్టె నా కొడుకు పుట్టి బుద్దెరిగినప్పట్నుంచి ఎవ్వల జోలి కన్న పొయిండా? తన పనేందో తనేందో! నన్ను బంగారమోలె సూసుకునె పని ఎక్కువ జెయ్యసియ్యకపాయె... మంచోల్లనే జెప్పున గొంచవోతడు దేవుడు. ఆళ్ళంటె ఎక్కో ప్రేముండదేమొ నాకు కొరివి పెడుతడనుకుంటె అన్నే బూడిదీ సెయ్య వల్సచ్చె నాకు..." తనలో తానే గొణుక్కున్నాడు పోచయ్య. కళ్ళవెంట కారే నీటిని తుడుచుకున్నాడు.

వర్షమింకా కురుస్తూనే వుంది. ఊళ్ళోకి ప్రవేశించాడు. చిమ్మ చీకటిగా వుంది. వణుకుతూ కాళ్ళీడ్చుకుంటూ ఇల్లు చేరుకున్నాడు. భర్తకొరకెదిరి చూస్తున్న పోచయ్య భార్య

"ఏంది గింతసేపాయె అడే పోతివి, మందు నాశిన మయినట్టేనా?" అంది.

"పొంగ మొగులన్నదే లేపాయె. గింత వానగొట్టవట్టె మనదృట్ట మెట్లుంటె గట్లయితది." అని గంప, గమాల అరుగుమీద పెట్టాడు పోచయ్య. గొంగడి తీశాడు. కోలాటం విప్పి జాడించాడు. చిలుక్కొక్కయ్య కారేశాడు రుమాలు, అంగీ తీసి పిండి అరుగుపైవున్న దండెం బొంగుపై ఆరేశాడు. ధోతి కూడా పిండి ఆరేశాడు. పొడి ధోతీ కట్టుకున్నాడు. రాత్రి కప్పుకోవడాని కుపయోగించే ధోతీ కట్టుకోవడం వల్ల రాత్రికేం గప్పుకోవాలె అనుకున్నాడు.

"పొయ్యిల అగ్గున్నాదె, సలివెడుతంది." వణుకుతూ అన్నాడు.

"ఇప్పుడే బువ్వదించిన సెగ మా వుంది రా" అని భర్తను లోపలికి తీసుకెళ్ళింది.

పొయ్యిముందు కూచొని అరికాళ్ళు, చేతులు పొయ్యి పైకి చాపాడు.

'అయ్ వెచ్చగుంది ..' అనుకుంటూ వేడయిన చేతుల్తో శరీరంపై రాచుకున్నాడు. వాన ఇంకా కురుస్తూనేవుంది. 'టన్ టన్' అంటూ చినుకులు గిన్నెలో పడ్డ చప్పుడు... వెనకకు తిరిగి చూశాడు. పైనుండి ఉరుస్తున్న నీరు క్రింద పెట్టిన గిన్నెలో బొట్లుబొట్లుగా పడుతుంది. "టప్" మంటూ ఓ చినుకు తలపై పడింది. కొంచెం పక్కకు జరిగాడు "టప్ టప్" ఉరుస్తుంది

"ఓ గంజు దెచ్చి గిక్కడ పెట్టు ఉరుత్తంది" అన్నాడు ప్రక్కనే కూర్చున్న భార్యతో.

"ఎన్ని ఔగల్లని గిన్నెలు పెట్టాలె? ఇల్లంత ఉరుసుడేనాయె? ఎండ కాలం ఇల్లు గప్పియ్యమంటె కప్పియ్యక పోతివి." అని ఓ కంచు తలె తీసుకొచ్చి పోచయ్య ప్రక్కన బెట్టిందతని భార్య.

"కప్పియ్యన్ననుకుంటిగని గూనపెంకకు, సుతారోనికి గలిసి ఇన్నూరుపాయలయిత యన్నమోలె పైసల్లెవ్వని ఊకుంటి. మల్ల ఆలోసించి కప్పిత్తామనెవారకు ఆనకాలమచ్చె... ఆనలు గొట్టనే వట్టె... ఎవుసప్పని తీరక పాయె... ఏం బతుకులోనే..." అన్నాడు పోచయ్య.

పొయ్యి చల్లారింది. ఇక లాభం లేదని లేచాడు. చినిగిన షోలాపూర్ ఛద్దరు కప్పుకున్నాడు. అరుగుమీది కొచ్చాడు. నులకమంచం వాల్చుకొని కూర్చున్నాడు

"మా తాత ముత్తాతలు ఎవుసం సేసుకుంటనే బతికిండ్రు ... మా నాయన్న గూడ మన్నుల మన్నయే బతికిండు. పుట్టి బుద్దెరిగి నప్పట్నుంచి నేం గూడ ఎద్దు ముడ్డి పొడుసుకుంటనే బతుకుతున్న ... ఒక్కడే కొడుకు నా వంశెం ఉద్దరిత్త దనుకుంటే నడు మంత్రాన వాయె... అరువయేండ్లయినా పని దప్పపాయె ... మట్టె గలసి పోయె దాక గిట్లనే బతుకుడయితది..." పోచయ్యకు జీవితమంతా గాడాంధకారంగా అగుపడుతుంది... బయటున్న చిమ్మ చీకటికీ తన జీవితానికేం తేడా కనబడటం లేదు... జీవితం గూర్చి ఆలోచిస్తున్న పోచయ్యకు పదేళ్ళ మనమడు జ్ఞాపక మొచ్చాడు. కొడుకు జ్ఞాపకార్థకంగా మిగిలిన ఆ పసివాడిపై అతనికి అంతులేని మమకారం.

"పొల్లగాడు పడుకున్నాడె...? కనవడుత లేదు." అన్నాడు భార్యతో.

"నువ్వు రాంగనే అడుగుదామనుకున్న మర్సి పొయిన. పొద్దు గూకినా నువ్వు రాకుంటే నేనద్దన్నా ఇనక చెత్తిరి పట్టుకొని నిన్ను తీసుకత్తనని ఉరికిండు."

"మంచిదానివే... గీ వానలెందుకు అవుతలికి పోనిచ్చినవ్... పసి పొల్ల గాడు." అని భార్యను కసిరాడు పోచయ్య.

"నే నద్దంటె ఇన్నడా? తాతందీసుకత్తనని చెత్తిరందుకొని దెంగో బిల్లనడు." అందామె.

పోచయ్య హృదయం ఆనందంతో ఉప్పొంగింది. తన కోసము పదేళ మనవడు పడే ఆరాటం అతన్ని కదిలించింది. అతని కళ్ళు చెమ్మగిల్లాయి. మాటి మాటికీ బజార్లోకి చూస్తూ మనుమని రాక కెదిరి చూస్తూన్నాడు. 'మనుమడు చదువుకోని పేరు కొస్తే...' అతన్లో ఎన్నో ఆలోచనలు. అలస్యమవుతున్న కొద్దీ అతన్లో ఆందోళన పెరుగుతుంది.

"జెప్పనత్తె మంచిగుడు పొల్లగాడు." అనుకొని "తీసుకనన్నత్త ఏడున్నడో" అని లేచి నిల్చున్నాడు పోచయ్య.

"ఆని కొరకు నువ్వు నీ కొరకాడు...మంచిగనే వుంది. కొద్దిగాగాడే అత్తడు." అందామె.

"మంచిదానివే ఈ వాన లెక్కడ తిరుగుతండో." అని గొంగళి కప్పుకొని అరుగు దిగబోయాడు. "ఛర్ ఛర్" మంటూ ఉరుము. "ఛక్ ఛక్" మని మెరుపు. ఆ మెరుపు వెలుతుర్లో బజార్లోనుంచి గొడుగు పట్టుకుని వస్తున్న మనవడు కనబడ్డాడు పోచయ్యకు. అతని కళ్ళలో వెలుగు గబగబా వచ్చి అరుగెక్కిన మనవన్ని ఆప్యాయంగా హృదయాని కత్తుకున్నాడు పోచయ్య.

□

